# పండుగ కట్నము

మహాలక్ష్మి పుట్టుకకు ప్రసాదరావుగారి గృహస్థితి బాగానేవుండేది. అప్పట్లోవారింట్లో లక్ష్మితాండవిస్తూ వుండేది. ఆమూలంగానే లేకలేక పుట్టిన యీ ఆడపిల్ల మహాలక్ష్మి అయింది. ఆమెముందు యింకొక మగపిల్లడు వున్నా ఆకారణంగానే తాత తండ్రులమధ్య దాసీ జనంమధ్య అల్లారుముద్దుగా పెరిగింది లక్ష్మి. తెల్లని శరీరము, విశాలమైనకనులు, తీర్చినకనుబొమలు, చక్కని నోరు ఆమె పేరును సార్థకంచేసాయి. లక్ష్మి నాల్గవ యేటనే బడికి బయలుదేరింది. తాతగారి అభిమానము చేత తండ్రిఆదరణచేత చిన్నతనంలోనే ఫిడేలు నేర్చుకుంది. కాని లక్ష్మికి జ్ఞానము పూర్తిగావచ్చేకాలానికి ప్రసాదరావు కుటుంబస్థితి బాగులేదు. లక్ష్మి వెనక నొక మొగపిల్లడు ఆడపిల్ల పుట్టారు. తాతల నాటి ఆస్తులు తన అనుభవంలోకి రాకుండానే తండ్రి పాడుచేశాడు. కుటుంబం గడవడం యెలాఅన్నది సమస్యే అయినా జ్ఞానమువచ్చిన పిల్లాపిల్లాడ్నీ, పరమ సాధ్వీఅయిన యిల్లాల్నిచూచుకొని ప్రసాదరావు సంతుష్టిచెందేవాడు. మహాలక్ష్మికి పదమూడవయేటికే విద్యాగంధము బాగుగా అలవడింది. తండ్రికి మన స్తిమితములేని గడియల్లోచక్కగాపాడి అత్యంతసంతోష ప్రాంతునిచేసేది. ఆరోజుల్లో అట్టికూతురుకన్న వేరేమి కావాలి? అన్నిసుగుణములు కలిగిన లక్ష్మికి గర్వములేకపోవడం అతనికి ఆశ్చర్యం వేసేది. లక్ష్మి సున్నితహృదయ. అది నిష్కళంకము. ఆమె మనసును విప్పి చదివితే 'ప్రేమ'అన్న అక్షరములు కనబడతాయి. అట్టి లక్ష్మి కష్టములనుభవించడం అతనికి యిష్టములేదు. అతడు వెదకివెదకి వొకవరుణ్ణి తెచ్చేడు. లక్ష్మి మనస్ఫూర్తిగా వొప్పుకున్నమీదట తను సాగినంతవరకు వైభవంగా వివాహముచేశాడు. తన అల్లుడు గౌరవమయిన కుటుంబములో పుట్టేడు. సుగుణవంతుడు. విద్యాధికుడు. రామారావు లక్ష్మిని భరించేవాడయ్యేడని అతడు నిజంగా గర్వించేడు.

అని పూజాసెలవులు. రామారావుని రమ్మని మామగారు మదరాసు వుత్తరము వ్రాసేరు. తనభర్త నాడు వస్తారుగదా అని లక్ష్మి వుత్సాహంగావుంది. రామారా వేకారణంచేతనో మెయిలుకురాలేదు. ఆమెకు ఆతృతహెచ్చింది. 'అక్కా బావయెప్పుడువస్తాడే' అన్న చెల్లెలి ప్రశ్నకు వినుక్కుంటూ గదిలో కూర్చుంది. కాలం యెంత అయిందో ఆమెకు తెలీదు. ఏమి తోచక 'ఫిడేలు'తీసి వాయిస్తూంది 'నసుపాలింపగనడచి వచ్చితివో'అని. రామారావు లోపల ప్రవేశించాడు. అతడు ప్యాసింజరులో వచ్చేడు. వాళీ స్టాండుమీద పడేస్తూ 'నడచిరాలేదు. బండిమీద'అంటూ వాలు కుర్చీలో కూర్చున్నాడు. లక్ష్మి వెనుదిరిగిచూచిందే. సిగ్గు సంతోషము వొకటి తర్వాత వొకటి ఆమెను ఆవహించాయి. ఆమె తిరిగి అదేపాడుతూంది.

'నమ్మకంలేదు?'

ఆమెలేచింది. మేజానానుకొని నించుంది.

'మెయిల్లోవస్తానన్నారు?'

'బెజవాడలో దిగాను.'

'ఇప్పుడు రారనుకున్నాను.'

'పొరపాటు!'

'ఆడవాళ్లంటే మీకంతలోకువా?'

'ఎవరు 'కువో తెలుస్తూనేవుంది. శలవు లివ్వగానే పరుగెత్తుకొచ్చాను.'

'బండి మీదన్నారు?'

'గలిచావే'

'జపము యెప్పుడూ మాదే.'

'బావా! గ్లాసుమంచి నీళ్లు కావాలేవిఁటి కాఫీ యిప్పుడే అయిపోయింది'అని కమల పరామర్శ చేసింది. రామారావుకి కమలని చూస్తే యెంతో అభిమానము. కమల దొరలపిల్లలావుంటుంది. ఆమె రోజు పట్టే పంతములు చూచి ఆ అమాయకురాలికి వాళ్లకుటుంబ స్థితి తెలీదుకదా అనుకునేవాడు.

'బావా! మెడ్రాసునుంచి నాకేమిటి తెచ్చావు?'

'సిల్కుఫ్రాకులు' కుట్టించితెచ్చాను. సూటుకేసు తీసి మీదనే వున్నాయి తీసుకో.'

కమల అక్కచేత తీయించింది.

'బాగున్నాయే అక్కా! బావమంచివాడే, అవునా?' లక్ష్మి సగర్వంగా వూరుకుంది.

'బావా! అక్కకేమీ తేలేదు?'

'తెచ్చేను.'

'ఏమిటి? ఎక్కడుంది?'అని ఆతృతగా ప్రశ్నించింది కమల.

'ఇదిగో'అని తన్ను చూపెట్టి నవ్వేడు రామారావు.

'పో బావా? యెప్పుడు హాస్యాలేనూ' అని కమల ఫ్రాకులుపట్టుకొని దారితీసింది.

లక్ష్మిమీద రామారావుకి యెంతో ప్రేమ. స్త్రీ పురుషులు సాధారణంగా చెప్పుకొనే ప్రేమకాదతనిది. అతడామెను భౌతికంగాకంటె నైతికంగానే హెచ్చు ప్రేమించాడు. లక్ష్మిని తను ఆరాధించవలసిన దేవతకి మల్లే భావించేవాడు. మెడ్రాసులో అతడిప్పుడు ఎం.యే. చదువుతున్నాడు. తన విద్యాపరిశ్రమ ఆమె సాహిత్యజ్ఞానంలో యెంత అనిపించేది.

'లక్ష్మి.'

ఆమె రామారావుని పరికించింది.

'నీవు నాప్రేమరాజ్యానికి రాణివి.'

ఈపాటికి చాలించండి.'

'యిలారా.'

ఆమె అతనిదగ్గరకు చేరింది.

'నీవు నాజీవితనౌకకు చుక్కానివి.'

'కానని యెవరన్నారు.'

అతడామెను వడిలోకిలాగేడు. ఆమెబుగ్గలు యెర్రబారినై.

నాడువిజయదశమి. రామారావు అభ్యంగనము అయినతర్వాత కాఫీ ఫలహారములు పుచ్చుకొని వరండాలో కుర్చీలో కూర్చున్నాడు. ప్రసాదరావంతవరకు ఆతనితో యేవోవో సంభాషించి వెళ్లిపోయాడు. కమలతో వొకటిరెండు మాటలాడి యింటిఅల్లుడు గదిలో పడుక్కున్నాడు 'షేక్స్పియరు'డ్రామాచదువుతూ. మధ్యాహ్నము భోజనముల దగ్గర సాయంత్రము ధవళేశ్వరము వెళతానని ప్రసాదరావన్నాడు.

'నేను మెయిలో వెళుతున్నా'నని రామారావు చెప్పేడు. ప్రసాదరావు ఆలోచనా పూర్వకంగా 'సరే'అని వూరుకున్నాడు. భోజనముఅయిన తర్వాత గదిలోకిపోయి పడుక్కున్నాడు రామారావు. గంట పోయిన తర్వాత లక్ష్మిగదిలో ప్రవేశించింది.

'నిద్రేనాయేవిఁటి?'

'.........'

'నామీదకోపము వచ్చినట్టుంది'

రామారావు కొంచెం వత్తిగిల్లేడు.

లక్ష్మి మంచంమీద కూర్చుంది.

'ఎందుకు?'

'ఏమిటి?'

'నామీదకోపం.'

'నీమీద యెందుకు!'

'పోనీ మీతోటి వచ్చేస్తాను.'

'ఎక్కడికి?'

'మెడ్రాసు.'

'వద్దు.'

'బెజవాడలో దిగిపోతాను.'

'మీఅమ్మ కింకా నీరసంగా వుందన్నావు.'

'అవును.'

'ఇక్కడేవుండు.'

'మరియెందుకు మొగం అలాముడిచావి రివాళ.'

'యేమీలేదు.'

నిజానికి రామారావు వుదయంనుంచీ అలాగేవున్నాడు. పండుగకి పిలిచి మామగారు తనకి తగినకట్నము యివ్వలేదని అతని అలక. స్వభావానికి రామారావు మంచివాడే. కాని అట్టి లోకలాంఛనమే అతని సుస్వభావాన్ని అరికట్టి లక్ష్మిపై యీర్ష్య కలిగించపోయింది. లోకజ్ఞానమెఱిగిన లక్ష్మిభర్త హృదయక్లేశము గ్రహించలేకపోలేదు. అందుకనే మాటల్లోపెట్టి ఆలోచన మరలింపబోయింది. రామారావు చదువుకున్నవాడు. తనగృహస్థితి తెలిసి విద్యాహీనునివలె, మూర్ఖునిలా ప్రవర్తించడం ఆమె సహించలేకపోయింది. పెద్ద చదువులు చదివినందుకు లంచములు కావాలి? అవి ప్రాపంచిక విషయపరిశీలనములేని చదువునకా! లోకానుభవములేని చదువు నేర్చుకున్నందులకా? అని ఆమెప్రశ్న. లక్ష్మి తెలివితక్కువదికాదు. హృద్భావము గ్రహించగలయువతి. రామారావుకి పాఠము నేర్పాలని ఆమె నిశ్చయించుకుంది.

'రేపు ప్యాసింజరులో వెళ్లండి.'

'మీవాళ్లు యిచ్చేకట్నాలు మిగిలిపోతాయనా?' అన్నాడు రామారావు.

రామారావుపై మహాలక్ష్మికి కోపమురాలేదు. తనస్థితికి ఆమె యిసుమంతయినా చలించలేదు. ఆమె యవ్వన హృదయంలో ధైర్యలక్ష్మి 'బావుటా' యెత్తింది. రామారావా మెముఖంలోకి చూచేడు. ఆమె నిశ్చలత్వానికి ఆశ్చర్యపోయాడు.

కాలమానాన్నిబట్టి మరోగంట గడచిపోయింది. కాఫీత్రాగి రామారావు వూళ్లోవెళ్లాడు. లక్ష్మి మనసును నొప్పించానేమో అని అతనికి భయంవేసింది. కాని లోకరివాజుప్రకారము తనకు జరగవలసిన గౌరవము యెందుకు జరగకపోవాలి అని అతనిప్రశ్న. అది శాసనమా అని ప్రశ్నించుకుంటే తీరిపోను. అందుకు యెవర్ని నిందించడం. సంఘాన్నా? తన అత్తవారినా? తనలక్ష్మినా? తన్నా?........ మెయిలుప్రయాణానికి ఆరుగంటలకే భోజనంఅయింది. గదిలోకివెళ్లి లోపల మేజామీద తమలపాకుల చిక్కాలలో వొక్కొక్కటే నములుతూ సూటుకేసు తెరచేడు. మీదనేవుంది తెల్లనికాగితము. తీసి ఆతృతగా చదివేడు.

"సంగీతసాహిత్యాల్లో బాలనై, ప్రేమరాజ్యాలలో యువతినై, ప్రాపంచికానుభవంలో ప్రౌఢనై, మీ జీవితనౌకకు చుక్కానినైన నేను మీకు కట్నం. ఇది కట్నంక్రింద భావించరుకాబోలు. కాకపోయినా యిది ఆనాడే మీకు వచ్చినదనుకున్నారేమో? లేదు. నేడు నేను హృదయపూర్వకంగా నన్ను అర్పించుకుంటున్నాను. ఇది మీకు పండుగకట్నము........ లక్ష్మి.. ..."

రామారావుకి దుఃఖమే వచ్చింది. గదిద్వారము వైపుచూచేడు. లక్ష్మి నించునివుంది. అతడుసంజ్ఞతోనే రమ్మని పిలిచేడు.

'నీ వెవరు?'

'మీ లక్ష్మిని.'

అతడామెను దగ్గరకు చేర్చుకున్నాడు.

'ఇల్లాంటి పండుగకట్నం యెవరేనా పుచ్చుకున్నారా?'

ఆమె తనశిరము నాతనిగుండెపై ఆని సాభిప్రాయంగా అతని ముఖంలోకిచూచింది.

జి. వెంకటరమణమ్మ.